క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల స్నాన మహోత్సవం



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గానుగులపేట గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ వెంకమ్మ, పోతురాజు బాబుల వార్షిక స్నాన మహోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. గణాచారులతో, మేళతాళాలతో, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని స్నాన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, నాట్యాలతో అమ్మ వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

సత్రంపాడులో మెగా దంత వైద్య శిబిరం



వైద్యులను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సత్రంపాడులో ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ దిరిసాల మధుచంద్ర, జాహ్నవి వైద్య సేవలు అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ ఆధ్వర్యంలో శిబిరంలో పాల్గొన్న సుమారు 60 మందికి ఉచిత వైద్య సేవలు, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్య సేవలు అందించిన వైద్యులను వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ శిబిరంలో వాకర్స్ పాస్ట్ ఇంటర్నేషనల్ ఏవీపీ పీ. ఆంజనేయులు, క్లబ్ ప్రెసిడెంట్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా క్యాబినెట్ సర్వీస్ సెక్రటరీ ఆదినారాయణ, క్లబ్ సెక్రెటరీ, ట్రెజరర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: దసరా ఉత్సవాలకు గ్రామాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లోని కనకదుర్గమ్మ, మహాలక్ష్మి దేవాలయాలు ముస్తాబమవుతున్నాయి. ఆలయాలను రంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో ఈ నెల 3 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

పదోన్నతి పొందినా ప్రయోజనం శూన్యం

- ఇంక్రిమెంట్లు లేవు. పెంచిన వేతనాలు ఇవ్వరు
- డ్రైవర్లుగా ప్రమోషన్ పొందిన 9 మంది ఉద్యోగుల ఆవేదన
- పదోన్నతి పొంది రెండున్నర ఏళ్లు పూర్తి



తొమ్మిది మందికి డ్రైవర్లుగా ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేయర్ (ఫైల్)



కమిషనర్ భాను ప్రతాప్‌కు సమస్యను విన్నవిస్తున్న డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): డ్రైవర్లుగా ప్రమోషన్ పొంది రెండున్నరేళ్లు కావస్తున్నా తమకు అందాల్సిన అదనపు ప్రయోజనాలు ఇవ్వకుండా నగరపాలక సంస్థ అధికారులు చిన్న చూపు చూస్తున్నారని 9 మంది డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్‌కు వినతిపత్రం అందించినా ఇంత వరకు తమ సమస్యను పరిష్కరించకపోవడంపై ప్రమోషన్ పొందిన డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు న్యాయం చేయాలని వారంతా వేడుకుంటున్నారు.

2022 మార్చి 30న పదోన్నతి

మున్సిపల్ కౌన్సిల్ మరియు ఫైనల్ కమిటీ సిఫార్సులు మేరకు 2022 మార్చి30న 8 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒకరు ఇంజనీరింగ్ విభాగం మజ్దూర్‌కు సీనియార్టీ ప్రకారం డ్రైవర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలిచ్చారు. ప్రమోషన్స్ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా తొమ్మిది మందికి పదోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వలేదు. కమిషనర్ కిందిస్థాయి అధికారులు పూర్తి నిర్లక్ష్యం కారణంగా వారికి తీవ్ర అన్యాయం జరిగింది. కమిషనర్‌కు, హెల్త్ ఆఫీసర్, మేయర్‌ను అనేక దఫాలు కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అన్యాయం



కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పదోన్నతులు పొందిన వారికి తీవ్ర అన్యాయం జరిగింది. ప్రమోషన్లు పొంది రెండున్నరేళ్లు కావస్తున్న పెరిగిన వేతనాలు, ఇంక్రిమెంట్లు వారికి ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు మానసిక ఆందోళన చెందుతున్నారు. యూనియన్ తరుపున అధికారులకు వినతి పత్రాలు అందించినా వారికి న్యాయం జరగలేదు.

– ఏ.అప్పలరాజు, జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

అర్హత ఆధారంగా డ్రైవర్లుగా పదోన్నతి



నిబంధనల ప్రకారం అర్హత ఆధారంగా 2022, మార్చి 30న డ్రైవర్లుగా పదోన్నతినిస్తూ అప్పటి కమిషనర్, హెల్త్ ఆఫీసర్, మేయర్ ఉత్తర్వులిచ్చారు. ఆనాటి నుంచి తొమ్మిది మంది డ్రైవర్లుగా పనిచేస్తున్నాం. మాకు పదోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వలేదు. దీనిపై కమిషనర్, హెల్త్ ఆఫీసర్, మేయర్‌ను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.

– దనుకొండ అప్పారావు, డైవర్, ఏలూరు కార్పొరేషన్

ఎటువంటి ప్రయోజనం అందలేదు



రెండున్నరేళ్లుగా అన్యాయానికి గురవుతున్నాం. ఇటీవల ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. అయినా ఇంత వరకు ఎటువంటి ప్రయోజనం మాకు అందలేదు. ఇటీవల కొత్తగా వచ్చిన కమిషనర్ ఏ.భానుప్రతాప్‌కు సమస్యను తెలియజేశాం. ఆయన త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

– పంతం వెంకటేశ్వరరావు, డ్రైవర్, ఏలూరు కార్పొరేషన్

మాకు న్యాయం చేయాలి



రెండున్నరేళ్లుగా చాలీ చాలని జీతాలతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. పేరుకే పదోన్నతులు కల్పించారు. ఇంత వరకు పదోన్నతి ప్రయోజనం అందలేదు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ కిందిస్థాయి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి మా తొమ్మిది మంది డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరుతున్నాము.

– గాడి అప్పారావు, డ్రైవర్, ఏలూరు కార్పొరేషన్

ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఏలూరు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో ఉచిత గుండె వ్యాధి శిబిరం నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన కాంటినెంటల్ హాస్పిటల్స్, ఏలూరు సిరి సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ డాక్టర్ ప్రసన్నకుమార్ సహకారంతో ఉదయం పది గంటల నుంచి ఈదర సుబ్బమ్మ దేవి హైస్కూల్ ప్రాంగణంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండె వ్యాధులకు సంబంధించిన టెస్టులు, రక్త పరీక్షలు, ఈసీజీ, ఈకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సుబ్బారావు, ఎం.చలపతిరావు, మానేపల్లి రామారావు, చందులూరి సుధీర్, పీ రత్నకుమార్, పీ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

2న ఉద్యమ అధ్యయన తరగతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులను అక్టోబర్ 2న ఏలూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ.రామారావు, బీ.రెడ్డిదొర తెలిపారు. ఈ తరగతులలో రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు -విద్యారంగంపై ప్రభావంపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. వక్తలుగా సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు హెచ్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.భాను మూర్తి, పీ.పాండురంగ వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు పాల్గొంటారని తెలిపారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

హైకోర్టు ఏజీపీ నీలోత్పల్‌కు సత్కారం



హైకోర్టు ఏజీపీలను సన్మానిస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా గంజి నీలోత్పల్‌ను నియమించడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని దెందులూరు మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయ చౌదరి, ప్రముఖ పారిశ్రామికవేత్త కలపాల చంద్రశేఖర్ బుజ్జి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గారపాటి కొండయ్య చౌదరి అన్నారు. ఆదివారం స్థానిక మర్చంట్ చాంబర్ కల్యాణ మండపంలో రాష్ట్ర హైకోర్టు ఏజీపీలుగా నియమితులైన గంజి నీలోత్పల్, గొల్ల బసవేశ్వర రావు, కొల్లూరి అర్జున్ చౌదరికి పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సేవ, సామాజిక, రాజకీయ రంగాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానంలో ఒక ఉన్నతమైన స్థానంలో నియామకం పొందడం అరుదుగా లభించే అదృష్టమన్నారు. అన్యాయానికి గురైన వారికి న్యాయం చేస్తూ న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించడానికి ఏజీపీలుగా నియమితులైన వారు కృషి చేయాలని సూచించారు. అనంతరం ముగ్గురు ఏజీపీలను సత్కరించి జ్ఞాపికలను, సన్మాన పత్రాలను అందజేశారు. సమావేశంలో ఏజీపీ నీలోత్పల్ మాట్లాడుతూ తాను హైకోర్టు ఏజీపీగా ఎంపిక కావడం వెనుక తన తల్లిదండ్రులు గంజి వెంకట్, సువర్చల, తన గురువుల ప్రోత్సాహం, వారి దీవెనల బలం ఉందన్నారు. అన్యాయానికి గురైన వారికి సత్వర న్యాయ సహాయం అందిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వర రావు, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు



ఐక్యత చాటుతూ చేతులు కలిపిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 32 మంది విద్యార్థుల, యువకుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న నిర్వహించనున్న నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ, ఐవైసీ, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్, పీఎస్ఎఫ్ఐ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, పీవైఎల్ జిల్లా నాయకుడు తగరం బాబు రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.లెనిన్, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆర్.సతీష్, వైఎస్ఆర్ ఎస్‌యూ నాయకుడు శివరావు, పీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం తన అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం కోసం ప్రైవేట్ పరం చేస్తోందని దీన్ని దీనిని అందరూ ఖండించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ చర్యను అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పోటుపడతామని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీయమని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామి అయి ఉండి కూడా నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. తిరుపతి లడ్డూ గురించి గగ్గోలు పెట్టే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

1న సీనియర్ సిటిజన్స్ డే వేడుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న సీనియర్ సిటిజన్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని హేలాపురి లయన్స్ సర్వీస్ సెంటర్‌లో డాక్టర్ వై. జగన్ మోహన రావు, కాకర్ల రాజేంద్రవరప్రసాద రావు, మడుపల్లి మోహన గుప్త, రావి గోపాల కృష్ణయ్య, సీఏ పాకలపాటి శరత్ కుమార్, వీ. నారాయణ మూర్తి, డాక్టర్ ఏఎస్ రావు, దేవినేని భాస్కర రావుకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో వైద్య శిబిరం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో సుగర్ బీపీ, ఈసీజీ, చర్మవ్యాధుల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా నిపుణులు ఆరోగ్య చిట్కాలు అందిస్తారని, యోగా, ధ్యానంపై శిక్షణనిస్తారని తెలిపారు.

నేడు ఏలూరుకు స్పేస్ ఆన్ వీల్స్ బస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష మహాయాత్ర - స్పేస్ ఆన్ వీల్స్ బస్సు సోమవారం ఏలూరుకు వస్తోందని జిల్లా సమన్వయకర్త ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు ఇస్రో కార్యకలాపాలు, భారత అంతరిక్ష మిషన్ సమాచారాన్ని అందించడం కోసం ఈ వాహనాన్ని స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో అందుబాటులో ఉంచుతారన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ వాహనం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్పేస్ ఆన్ వీల్స్ వాహనంలో ఇస్రో నిర్వహించిన అంతరిక్ష యాత్రల సమాచారం, వివిధ ఉపగ్రహాల నమూనాలు, లాంచ్ ప్యాడ్స్ అంశాలు, ఇస్రో సాంకేతిక నిపుణులు విద్యార్థులకు వివరిస్తారు. ఈ మేరకు ఏలూరు పరిధిలోని ఆసక్తిగల పాఠశాలల, కళాశాలల విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా సమన్వయకర్త ఎస్.వెంకటేశ్వరరావును 8142035942 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

5న సాహిత్యోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సాహిత్య మండలి ఆధ్వర్యంలో అక్టోబర్ 5న శరన్నవరాత్రుల సాహిత్యోత్సవం, కేవీ సత్యనారాయణ సాహిత్య పురస్కార సభ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడుపల్లి మోహన గుప్త, పుల్లాభొట్ల పురుషోత్తమరావు తెలిపారు. స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఉదయం నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం తొలుత స్వాగత నృత్యంతో ప్రారంభమవుతుందన్నారు. అనంతరం విశాఖకు చెందిన శతావధాని తాతా సందీప్ శర్మ ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహిస్తారన్నారు. అనంతరం కేవీఎస్ సాహిత్య పురస్కార ప్రధాన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కేవీఎస్ సాహిత్య పురస్కారానికి ధూళిపాళ మహాదేవమణిని, శతావధాని తాతా సందీప్ శర్మను ఎంపిక చేశామన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ



సంగీత కచేరీలో గీతాలాపన చేస్తున్న కళాకారుడు యశస్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. విజయవాడకు చెందిన సంగీత కుటుంబ వారసులైన మల్లాది శివానంద యశస్వి ఆలపించిన గీతాలు ఆద్యంతం తన్మయత్వంలోకి తీసుకెళ్లాయి. ఆయనకు మల్లాది సింధు రాజేశ్వరి (వయోలిన్), మల్లాది శ్రీ అరవింద్ కార్తీక్ (మృదంగం) అందించిన వాయిద్య సహకారం అద్భుత రీతిన కొనసాగి కళాభిమానులను రంజింపజేసింది. ఈ సందర్భంగా హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు మాట్లాడుతూ సంగీతం మనస్సుకు నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి కళారత్న కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం మనిషి జీవితంలో ఔషధంగా ఉపయోగపడుతుందని, ఇటువంటి సంగీత కచేరీలు ప్రస్తుతం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తొలుత ప్రేక్షకులకు సంగీత కళాకారులను గుడిపాటి లలితా శర్మ అందరికీ పరిచయం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కచేరీ అనంతరం సంగీత కళాకారులకు సంస్థ తరపున సత్కరించారు. కేవీఎస్ ట్రస్ట్ తరపున వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన గుడిపాటి లలితా శర్మ, యర్రా సోమలింగేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు, సహాయ కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు, సభ్యులు వీవీపీ హనుమంతరావు, కొమ్మన కొండబాబు, డీ. హేమ సుందర్, ఏ. పార్వతీ రామచంద్రన్, పైడి. భీమేశ్వరరావు, కడియం ప్రసాద్ బాబు, ఏ. రంగవర ప్రసాద్, ఎం. సూర్యనారాయణ యాదవ్, పెదపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

ఏలూరు ఎక్సైజ్ సీఐగా ధనరాజ్



కె.ధనరాజ్, ఏలూరు ఎక్సైజ్ సీఐ

ఏలూరు టౌన్: ఏలూరు మద్యనిషేధ అబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.ధనరాజ్ నియమితులయ్యారు. ఆయన ఆదివారం ఏలూరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సీఐ ధనరాజ్ ప్రస్తుతం విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో విధులు నిర్వర్తించారు. గతంలో ఏలూరు ఎక్సైజ్ సీఐగా పనిచేసిన ధనరాజ్ అనంతరం గత ప్రభుత్వం ఎస్ఈబీ ఏర్పాటు చేయటంతో ఎస్ఈబీ ఏలూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో పేకాట, కోడిపందేలు, నాటుసారా, అక్రమ మద్యం తరలింపు కేసులను ఛేదించి సమర్థవంతమైన అధికారిగా ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. అనంతరం విజయవాడలో ఎస్ఈబీలో పనిచేసి బదిలీపై ఏలూరు జిల్లాకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ ధనరాజ్‌ను సిబ్బంది అభినందించారు.

రైల్వేగేటు మూసివేతతో ప్రయాణానికి ఇక్కట్లు



ఉంగుటూరు రైల్వేగేటు

ఉంగుటూరు: నిత్య రద్దీగా ఉండే ఉంగుటూరు రైల్వేగేటును రైల్వేశాఖ మూసి వేసింది. ఈనెల 28న మూసివేసిన ఈ గేటును తిరిగి అక్టోబరు 5వ తేదీన తెరవనున్నారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా గేటు మూసి వేశారు. ఉంగుటూరు-నల్లజర్ల వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఈ మార్గం ఉపయోగపడుతోంది. ఉంగుటూరు ఎగువ ప్రాంతంలో ఉన్న ఎన్నో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు పెరిగిపోవడం, అందులో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తారు. దీంతో నిత్యం ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిని ఆనుకుని ఉన్న సుమారు పది గ్రామాల ప్రజలు రైల్వే గేటును మూసివేయడంతో ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు. ఉంగుటూరు గ్రామం కాలువకు ఇరువైపులా విస్తరించడంతో నిత్యం ప్రజలు గేటు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వారందరు గేటు మూసివేసిన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించినా చర్యలు లేవా?

గణపవరం: ఉండి నియోజకవర్గం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని స్వయంగా పీకివేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ గణపవరం మండల కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేవీపీఎస్ నాయకుడు చిన్నం నాగేశ్వరరావు అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం దారుణమని, ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యేపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బళ్లారపు అశోక్, చిన్నం సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	68-100
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-48	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70-150
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	40-54	పాలకూర	15
దొండకాయలు	38	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	34-40	బఠాణీ	--
ఆనపకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	58